తెలంగాణ భవన్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, పద్మారావు, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్

పూలే ఆశయాలను సాధించాలి

వర్ధంతి సభల్లో వక్తలు

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. పూలే 134వ వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌తోపాటు అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పూలేకు ఘన నివాళులర్పించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. శాసనమండలిలో విపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని, మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, పద్మారావుగౌడ్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వెంకటేశ్, ముఠా గోపాల్ నివాళులర్పించారు.

'చేతి'తో కమలం చెట్టాపట్టాల్!

- రేవంత్‌పై ఈగ వాలకుండా కాపాడుతున్నరు
- ప్రజల సమస్యలను గాలికొదిలేశారు: కేటీఆర్
- బీఆర్‌ఎస్వీ నేతల అరెస్టుపై మండిపాటు

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ 'చేతి'తో కమలం ఒదిగి చెట్టాపట్టాల్ వేస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ పార్టీతో రాష్ట్రంలోని మీ కమలం నేతలు కలిసికట్టుగానే పనిచేస్తున్నారు మోదీగారూ' అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. చోటే భాయ్‌కి వ్యూహకర్తగా, కాంగ్రెస్ కట్టర్ కార్యకర్తలుగా విశ్రమించకుండా పనిచేస్తున్నారని తెలిపారు. 'చీకటి రాజకీయ ప్రయోజనాల కోసం చేయి కలుపుతూ చోటేభాయ్ కోసం కలిసి పనిచేస్తున్నారు. ఎన్ని అరాచకాలు జరిగినా ఒక్కరూ నోరుమెదపరు. రేవంత్ మీద ఈగ వాలకుండా కాపాడుకుంటారు' అని పేర్కొన్నారు. 'హైడ్రా మంచిదంటరు. మూసీ కావాలంటరు. ఏమన్నా అంటే నిద్ర నటిస్తారు. పిల్లలు చనిపోయినా, రైతు గుండె పగిలినా, గిరిజనులను చెరబట్టినా చప్పట్లు కొడతారు. రాష్ట్రంలో వారి చేతిలోనే కమలం ఉన్నది జాగ్రత్త.. భద్రం' అని కేటీఆర్ ఇరు పార్టీల నాటకీయతను బయటపెట్టారు.

బడిపిల్లలకు బాసటగా నిలిస్తే కేసులా?

బడిపిల్లలకు బాసటగా నిలిస్తే అరెస్ట్ చేస్తారా? పురుగుల అన్నం పెడుతున్నారని ప్రశ్నిస్తే కేసులు పెడ్తారా? అని ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల సమస్యలపై, విద్యార్థుల ఆత్మహత్యలపై, పిల్లల మరణాలపై గళమెత్తితే గొంతు నొక్కుతారా? అని మండిపడ్డారు. బీఆర్‌ఎస్వీ నాయకుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని, వారిని తక్షణమే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అబద్ధానికి ప్రతిరూపం కాంగ్రెస్ సర్కార్

అబద్ధానికి అంగీ, లాగు తొడిగితే అది కాంగ్రెస్ సర్కార్ అని కేటీఆర్ ఆరోపించారు. రైతుభరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో దోఖా చేసి, పంటల కొనుగోళ్లకు శఠగోపం పెట్టి.. బోనస్ ఎగ్గొట్టిన దుర్మార్గ పాలన ఇదని మండిపడ్డారు. దిలావర్‌పూర్‌లో దమనకాండ సృష్టించి.. రామన్నపేటను రావణకాష్టం చేసి.. లగచర్ల రైతులను జైలుపాలు చేసి అల్లుడి కండ్లలో ఆనందం చూసినందుకా? పండుగలు మీకు-పస్తులు రైతులకు అనుకునే సర్కార్ తీరుపై విరుచుకుపడ్డారు. రైతులను ముంచినందుకు? వ్యవసాయాన్ని ఆగం చేసినందుకా విజయోత్సవాలు? అని ధ్వజమెత్తారు.

మూసీ సాయమూ మోసమే!

మొదటిపేజీ తరువాయి...

పరిహారం విషయంలో పార్లమెంట్‌కు చెప్పిన అంశాలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని, ఎక్కడికి రావాలో ముఖ్యమంత్రి చెప్పాలని సవాల్ విసిరారు. 'బుల్డోజర్ ఎక్కించి చంపుతా.. తొక్కుతా.. ఇలా ఇష్టమొచ్చినట్టు మాట్లాడుడు కాదు రేవంత్‌రెడ్డి.. నేను ఎక్కడికి రావాలన్నా సిద్ధం. బహిరంగ సవాల్ చేస్తున్న.. టీవీ చర్చకా? సెక్రటేరియట్‌కా? ఆల్ పార్టీ మీటింగ్‌కా? ఎక్కడికి రావాలో చెప్పు.. అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఆల్ పార్టీ మీటింగ్ పెట్టాలని కేటీఆర్‌తోపాటు తాను కూడా డిమాండ్ చేశానని, మరి ఎందుకు పెట్టలేదని నిలదీశారు.

2013 భూ సేకరణ చట్టం ఎక్కడ అమలైంది?

తెలంగాణభవన్‌లో గురువారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్‌ఎస్ నేతలు విప్లవ్‌కుమార్, శివకుమార్‌తో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. '2013 భూసేకరణ చట్టం ప్రకారం.. ముందుగా పబ్లిక్ నోటీసు ఇవ్వాలి. అభ్యంతరాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలి. పరిష్కరించి ముందుకు వెళ్లాలి. ఏ ఇల్లు అయినా ఆ ఇంటికి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు వెళ్లి పాత ఇంటికి ఎంత విలువ ఉంటుందో అంచనా వేయాలి. రెండింతలు డబ్బును ఇంటి యజమానికి ఇవ్వాలి. ఉపాధి కోల్పోయిన వారికి వేజ్ లాస్ కింద రూ.7.5 లక్షలు ఇవ్వాలి. పెళ్లి కాని వారికి రూ.5 లక్షలు ఇవ్వాలి. వివాహితులకు 250 గజాల స్థలం, డబుల్ బెడ్ రూం ఇవ్వాలి. ఆ ఇంటికి కరెంటు, రోడ్డు, దవాఖాన, దేవాలయాలు వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా కాలనీ నిర్మించి ఇవ్వాలి. కానీ, ఒక్కటీ అమలు కాలేదు. నిజానికి డబుల్ బెడ్ రూం ఇండ్లను సేలబుల్ అంటే అన్ని హక్కులతో ఇవ్వాలి. కానీ, కేసీఆర్ కట్టించిన ఇండ్లను కేవలం అసైన్డ్ పేపర్ ఇచ్చి పంపించారు. అంటే వారికి ఆ ఇండ్ల మీద ఎలాంటి హక్కులు ఉండవు. ప్రజలను, పార్లమెంట్‌ను కూడా మోసం చేసిండు రేవంత్‌రెడ్డి. మున్సిపల్ మంత్రి, ముఖ్యమంత్రి ఆయనే ఉండి ఆయనకు తెలిసి కూడా కేంద్రానికి తప్పుడు సమాచారం అందించారు. దానినే పార్లమెంట్‌లో సమాధానంగా కేంద్ర మంత్రి చెప్పారు' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం ముందుగా పబ్లిక్ నోటీసు ఇవ్వాలి. అభ్యంతరాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలి. పరిష్కరించి ముందుకు వెళ్లాలి. ఇంటికి ఎంత విలువ ఉంటుందో అంచనా వేసి రెండింతలు డబ్బును యజమానికి ఇవ్వాలి. ఉపాధి కోల్పోయిన వారికి వేజ్‌లాస్ కింద రూ.7.5 లక్షలు ఇవ్వాలి. కానీ ఒక్కటైనా అమలు చేశావా రేవంత్. -హరీశ్‌రావు

సోనియా గాంధీని గతంలో బలిదేవత అన్నరు. ఇప్పుడు తల్లి అంటున్నరు. వరంగల్‌లో సీఎం మాట్లాడుతూ.. సోనియా కాళ్లు కడిగి నెత్తిన పోసుకుంటా అన్నరు. నిజంగా ఆమె మీద గౌరవం ఉంటే నాటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన భూసేకరణ చట్టం 2013ను మూసీ బాధితులకు అమలు చెయ్యి రేవంత్ -హరీశ్‌రావు

నిబంధనలు పాటించారా?

'మూసీ ప్రాజెక్టు కారణంగా నష్టపోతున్న, నిర్వాసితులు అవుతున్నవారిని ముందు గుర్తించాలి. కానీ, అలా చేయలేదు. అసైన్డ్ భూమి అయినా, ఎన్‌క్రోచ్‌మెంట్ అయినా, పట్టాభూమి అయినా, ప్రభుత్వ భూమిలో ఉన్నా అందరికీ సమాన హక్కులు ఉంటాయని చట్టం చెప్పింది. ముందుగా ఎన్యుమరేషన్ జరగాలి. 60 రోజుల సమయం ఇస్తూ దినపత్రికల్లో నోటీసు ఇవ్వాలి. వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలి. 30 రోజుల వ్యవధితో మరో నోటీసు ఇవ్వాలి. అప్పుడు ప్రక్రియ ప్రారంభించాలి. కానీ ఇక్కడ నోటీసులు లేవు, డీపీఆర్ లేవు, ఎన్యుమరేషన్ లేదు. ఇవేవి లేకుండా నేరుగా ఇండ్లు కూలగొట్టి బాధితులను రోడ్డున పడేసి.. కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇచ్చారు' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మూసీ ప్రాజెక్టు పరిహారంపై పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు వచ్చిన సమాధానంతో రాష్ట్ర కాంగ్రెస్ మోసపూరిత వైఖరి బయటపడిందని వివరించారు. మూసీ నిర్వాసితులకు భూసేకరణ చట్టం 2013ను అమలు చేస్తున్నామని పచ్చి అబద్ధం చెప్పారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి సర్కారు చెప్తున్నదొకటి.. ఇక్కడ అమలు చేస్తున్నది మరొకటని మండిపడ్డారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై వాస్తవాలను దాచిపెడుతున్నదని విమర్శించారు.

కూల్చివేసిన ఇండ్లకు ఎవరు బాధ్యులు?

కుటుంబాలు ఉంటున్న ఇండ్లను ఇకపై కూల్చబోమని ఇప్పుడు చెప్తున్నారని, ఇప్పటికే కూల్చినవేసిన ఇండ్ల సంగతి ఏమిటని నిలదీశారు. కూల్చివేసిన ఇండ్లకు ఎవరు బాధ్యులు? అని ప్రశ్నించారు. 'హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చారు. ఇంట్లో ఉన్న పుస్తకాలు తెచ్చుకుంటా అని చిన్నపాప అడిగినా కనికరించలేదు. ఇండ్లు కూల్చారు. కట్టుబట్టలతో ఇండ్ల నుంచి బయటకు గెంటేశారు. దీనికి ఎవరు బాధ్యులు? నష్టపరిహారం ఇచ్చినా వారు పడిన బాధ పోదు. మూసీ విషయంలోనూ అదే పరిస్థితి. కూలిన ఇండ్లకు నష్టపరిహారం ఎలా చెల్లిస్తావు. పేదల ఉసురు పోసుకుంటున్నావు. రాష్ట్రం పరువు తీస్తున్నావు' అని రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు.

కుటుంబాలు విచ్ఛిన్నం

'ఓల్డ్ మలక్‌పేటలోని శంకర్‌నగర్‌లో ముజాహిత్, షాహిన్‌బేగం దంపతులకు 8 గదుల ఇల్లు ఉండే. బిడ్డ, కొడుకులు, మనుమళ్లు, మనుమరాళ్లతో 8 గదుల్లో 16 మంది ఉండేవాళ్లు. వీరి ఇల్లు కూలిగొట్టి కేసీఆర్ కట్టించిన ఒక డబుల్ బెడ్ రూం ఇల్లు ఇచ్చి వెళ్లిపోండి అన్నరు. చట్టం ప్రకారం వారికి ఐదు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలి. కానీ, ఒక్కరికే ఇవ్వడంతో మిగతా నాలుగు కుటుంబాలు ఇతర ప్రాంతాల్లో కిరాయి ఇండ్లలో ఉంటున్నాయి. ప్రభుత్వ చర్యల వల్ల ఇలాంటి అనేక కుటుంబాలు విచ్ఛిన్నం అయ్యాయి. మానవత్వంతో ఇండ్లు ఇస్తున్నామని పార్లమెంట్‌కు చెప్పారు. మానవత్వం కాదు హక్కుగా బాధితులకు ఇండ్లు ఇవ్వాల్సిందే' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మూసీ పునరుద్ధరణకు బీఆర్‌ఎస్ వ్యతిరేకం కాదని, మూసీ ముసుగులో రాష్ట్ర ప్రభుత్వ నిధులు కొల్లగొట్టడానికి వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును ప్రారంభించిందే కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ అని గుర్తుచేశారు. అవాస్తవాలు చెప్పడంపై పార్లమెంట్‌లో తమ ఎంపీ సురేశ్‌రెడ్డి, ఇతర ఎంపీలు ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేస్తారని వెల్లడించారు. నిరుపేదల పక్షాన బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయస్థానాలకు సైతం వెళ్తామని, చట్టం ప్రకారం ఆ పేదలకు సాయం చేసేందుకు ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని, మూసీ బాధితులకు పూర్తి అండగా ఉండి పోరాటం చేస్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఇది కేసీఆర్ ప్రభుత్వ పనితీరు..

కేసీఆర్ నాయకత్వంలో కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్, పాలమూరు ఎత్తిపోతల, సీతారామ ప్రాజెక్టుల్లో భూసేకరణ చట్టం 2013 కంటే తాము తెచ్చిన మెరుగైన 2014 చట్టాన్ని అమలు చేశామని హరీశ్‌రావు గుర్తుచేశారు. 'కేసీఆర్ కూడా ఒక నిర్వాసిత కుటుంబం నుంచి వచ్చారు కాబట్టి నిర్వాసితుల గురించి గొప్ప ఆలోచన చేశారు. నిర్వాసితులకు 121 గజాల స్థలంలో ఐఏవై ఇల్లు కట్టించాలని 2013 చట్టంలో ఉంటే.. కేసీఆర్ 250 గజాల స్థలంలో డబుల్ బెడ్ రూం ఇల్లు నిర్మించి ఇచ్చారు. ఐఏవై ఇల్లు అంటే ఆ రోజు రూ. 1.20 లక్షలు మాత్రమే. మేం కట్టించిన డబుల్ బెడ్‌రూం ఇల్లు అంటే రూ.5-6 లక్షలు. వేజ్‌లాస్ (ఉపాధి) కూడా పెంచాం. 18 ఏండ్లు నిండినవారికి రూ.5 లక్షలు ఇచ్చాం. ఇండ్లు కట్టించి ఇచ్చాం. దేశంలోనే గొప్పగా ఆర్‌అండ్ ఆర్ కాలనీ నిర్మించాం. 99.1 శాతం నిర్వాసితులకు చట్ట ప్రకారం పరిహారం చెల్లించాం' అని హరీశ్‌రావు గుర్తుచేశారు.

6,213 స్కూళ్ల మూసివేతకు కుట్ర!

- అందుకే 5,741 మంది టీచర్ల బదిలీలు
- కేసీఆర్ బలోపేతం చేస్తే.. రేవంత్ బలహీనం
- ఎక్స్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు పాఠశాలలను మూసివేసే కుట్ర చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. జీరో స్కూల్ పేరిట 1,899 స్కూళ్లు, 10 మందిలోపు విద్యార్థుల కారణంగా 4,314 స్కూళ్లను కలిపి 6,213 ప్రభుత్వ పాఠశాలలను శాశ్వతంగా మూసివేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. ఇందులో భాగంగానే 5,741 మంది టీచర్లను బదిలీలు చేస్తున్నదని గురువారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'ప్రతి చిన్న గ్రామానికి ప్రాథమిక, ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రాథమికోన్నత, హైస్కూల్ చొప్పున ఏర్పాటు చేస్తామని అభయహస్తం మ్యానిఫెస్టోలో ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చి సంవత్సరం కాకముందే వేలాది స్కూళ్ల మూసివేయాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం 7,289 కోట్లతో మన ఊరు-మన బడి, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం సన్నబియ్యంతో పౌష్టికాహారం అందించిందని, రేవంత్ సర్కారు వచ్చీ రాగానే సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీం రద్దు చేయడం, మన ఊరు మన బడి ప్రోగ్రాంను కొనసాగించక, పురుగుల అన్నం, విషాహారంతో మధ్యాహ్న భోజనం వల్ల ప్రభుత్వ పాఠశాలల పరపతి తగ్గి ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతున్నదని పేర్కొన్నారు.

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం పెట్టాలి: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాజంలో కులవివక్ష, అసమానతలు రూపుమాపడానికి అలుపెరుగని కృషి చేసిన సంఘ సంస్కర్త పూలే అని ఎక్స్ వేదికగా ఆమె ప్రశంసించారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా 'దీక్షా దివస్' నిర్వహణకు బీఆర్‌ఎస్ భారీ ఏర్పాట్లు.. పరిశీలించిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధమైంది. అన్ని జిల్లా కేంద్రాల్లో ఇప్పటికే ఏర్పాట్లుచేసింది. ర్యాలీలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ శ్రేణులు రెడీ అయ్యాయి. తెలంగాణభవన్‌లో దీక్షా దివస్ ఏర్పాట్లను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం పరిశీలించారు. శాసనమండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, దీక్షాదివస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, నాంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు ఆనంద్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి సహా పార్టీ సీనియర్ నేతలు ఏర్పాట్ల పరిశీలన సమయంలో కేటీఆర్ వెంట ఉన్నారు.

రాష్ట్రంలో ఏకైక దీక్షాదివస్ పైలాన్

వరంగల్, నవంబర్ 28 : సబ్బండ జాతులను ఏకం చేసి మలిదశ తెలంగాణ ఉద్యమం ఉగ్రరూపం దాల్చేలా నవంబర్ 29న కేసీఆర్ చేసిన దీక్షను చేపట్టారు. దీనికి గుర్తుగా వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ ఆవరణలో ఏకైక దీక్షాదివస్ పైలాన్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు, కార్పొరేటర్‌గా ఉన్న జోరిక రమేశ్ కౌన్సిల్ సమావేశంలో దీక్షా దివస్ గుర్తుగా బల్దియా ఆవరణలో పైలాన్ ఏర్పాటు చేయాలని తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. అప్పటి మేయర్ ప్రకాశ్‌రావు తీర్మానానికి ఆమోదం తెలిపి 10 లక్షలు కేటాయించారు.

కేసీఆర్ దీక్షే కీలక మలుపు

- ప్రాణత్యాగానికి సిద్ధపడిన మహానేత
- కేసీఆర్ స్ఫూర్తితో దీక్షా దివస్ నిర్వహిస్తాం
- భారీ బైక్ ర్యాలీ, నిమ్స్‌లో పండ్ల పంపిణీ
- ఇథనాల్ కంపెనీతో మాకు సంబంధం లేదు
- మాజీ మంత్రి తలసాని

తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్ తదితరులు

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగానికే సిద్ధపడిన మహా నేత కేసీఆర్ అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కొనియాడారు. 2009 నవంబర్ 29న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిందని చెప్పారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్ష అనంతరం తలసాని మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పోరాట స్ఫూర్తితో దీక్షా దివస్ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అన్నివర్గాలు కదం తొక్కినట్టే ఈ కార్యక్రమంలో ప్రజలు మమేకం కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని అన్ని నియోజకవర్గాల నుంచి భారీ బైక్‌ర్యాలీలుగా బసవతారకం హాస్పిటల్ సర్కిల్ వరకు చేరుకుంటారని, అక్కడి నుంచి పాదయాత్రగా తెలంగాణ భవన్‌కు చేరుకోనున్నట్టు తెలిపారు. తెలంగాణ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, కేసీఆర్ ఉద్యమ డాక్యుమెంటరీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అనంతరం నిర్వహించే సమావేశానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరవుతారని చెప్పారు. నిమ్స్ దవాఖానలో శుక్రవారం ఉదయం 10 గంటలకు రోగులకు, పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తామని తలసాని తెలిపారు.

నిరూపిస్తే కంపెనీని రాసిస్తాం: తలసాని

ఇథనాల్ కంపెనీతో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టంచేశారు. ప్రభుత్వ అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకే తమపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి సీతక్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన తప్పుడు ఆరోపణలను తలసాని తీవ్రంగా ఖండించారు. ఇథనాల్ కంపెనీతో తన కుటుంబసభ్యులకు సంబంధం ఉన్నట్టు నిరూపిస్తే ఆ కంపెనీని వాళ్లకే రాసిస్తామని సవాల్ విసిరారు. ఇథనాల్ కంపెనీపై ఎక్కడంటే అక్కడ చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందనడం విడ్డూరమని మండిపడ్డారు. ఇథనాల్ కంపెనీకి అనుమతులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం అన్న విషయం కూడా తెలుసుకోరా? అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పట్టని కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదని, బట్టకాల్చి మీదేస్తూ.. తనను, బీఆర్‌ఎస్‌ను బద్నాం చేయాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారికి గట్టి సమాధానం చెప్తానని హెచ్చరించారు.

ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర. చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు

కేసీఆర్ దీక్ష ప్రాముఖ్యతను చాటాలి

- నేటి దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ వద్దిరాజు పిలుపు

ఖమ్మం, నవంబర్ 28: 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో' అనే నినాదంతో 2009 నవంబర్ 29న ఉద్యమసారథి, స్వరాష్ట్ర సాధకుడు కేసీఆర్ చేపట్టిన దీక్ష గురించి, దాని ప్రాముఖ్యత గురించి భావితరాలకు తెలియజేసేందుకు ఖమ్మంలో శుక్రవారం దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు తెలిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఖమ్మంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణ జైత్రయాత్రో.. కేసీఆర్ శవయాత్రో' అనే నినాదంతో నాడు దీక్ష చేపట్టిన కేసీఆర్‌ను అప్పటి పాలకులు కరీంనగర్‌లో అరెస్ట్ చేయించి ఖమ్మం తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. నాటి కేసీఆర్ ఉద్యమ చరిత్రను, ఉద్యమంతో ఖమ్మానికి ఉన్న అనుబంధాన్ని దీక్షా దివస్ సందర్భంగా చాటి చెప్పేలా బీఆర్‌ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

'భద్రాద్రి'లోనూ భారీగా కార్యక్రమాలు: వద్దిరాజు రవిచంద్ర

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ జిల్లా బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. 15 ఏండ్ల క్రితం కేసీఆర్ చావు నోట్లో తలపెట్టిన కేసీఆర్.. శాంతియుత పద్ధతిలో తెలంగాణను సాధించినట్టు తెలిపారు. అబద్ధాలతో ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల హామీల అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు.

తెలంగాణ ఆమ'రణ' సంతకానికి 15 ఏండ్లు

రాష్ట్రవ్యాప్తంగా నేడు దీక్షాదివస్

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగిన నవంబర్ 29 (2009)న బీఆర్‌ఎస్ దీక్షాదివస్‌గా పాటిస్తున్నది. ఉద్యమరూపం భావజాల వ్యాప్తి దశ నుంచి పోరాట పథానికి మారిన నేపథ్యాన్ని పురస్కరించుకొని గత 14 ఏండ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగిన రోజు నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన (డిసెంబర్ 9, 2009) వరకు 11 రోజులు ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు ఉత్కంఠగా చూసింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు క్రమంలో కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష అజరామర ఘట్టంగా చరిత్రలో నిలిచిపోయింది. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో', 'తెలంగాణ జైత్రయాత్రో.. కేసీఆర్ శవయాత్రో' అని ప్రతినబూనిన ఉద్విగ్నభరిత క్షణాలను నెమరు వేసుకోవడంలో భాగంగా శుక్రవారం రాష్ట్రం దీక్షాదివస్‌ను జరుపుకొంటుంది.

ఆరోజు ఏం జరిగింది?

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నవంబర్ 29న (2009) సిద్దిపేటలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని కేసీఆర్ ప్రకటించగానే ముందు రోజు అర్ధరాత్రి కరీంనగర్‌లో ఉద్విగ్న వాతావరణం నెలకొన్నది. కేసీఆర్ బస చేసిన ఉత్తర తెలంగాణ భవన్ చుట్టూ మోహరించిన పోలీసులు కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వారి ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ప్రజలు, కార్యకర్తలు సన్నద్ధమయ్యారు. ఫలితంగా పోలీసు బలగాల మధ్యలోనూ, ఉత్తర తెలంగాణ భవన్‌లోనూ రాత్రంతా ఉద్యమం రణమై ఎగసిపడింది. ఆ ఉద్రిక్త వాతావరణం మధ్యే తెల్లారింది. నవంబర్ 29న ఉదయం కరీంనగర్‌లో కేసీఆర్ మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వ దమనకాండను ఎండగట్టారు. అక్కడి నుంచి ఆచార్య కొత్తపల్లి జయశంకర్, మాజీ మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, జీ విజయరామారావు, పార్టీ సీనియర్ నేత కన్నెబోయిన రాజయ్యయాదవ్ తదితరులతో కలిసి వాహనంలో సిద్దిపేట దీక్షాస్థలికి వెళ్లేందుకు కేసీఆర్ సిద్ధమయ్యారు. ఉత్తర తెలంగాణ భవన్ వద్ద ఆయనను అదుపులోకి తీసుకొని దీక్షను భగ్నం చేయాలని పోలీసులు భావించారు. వేలాదిమంది కార్యకర్తలు, నాయకులు మోహరించడంతో పోలీసులు తమ వ్యూహాన్ని కరీంనగర్ పొలిమేరలకు మార్చుకున్నారు. ఆ తర్వాత అత్యంత నాటకీయ పరిణామాల మధ్య అల్గనూర్ చౌరస్తా వద్ద కేసీఆర్ వాహనాన్ని అడ్డుకొని ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కేసీఆర్‌ను అదుపులోకి తీసుకున్నది సాధారణ పోలీసులు కాదు.. ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులతో తలపడేందుకు వినియోగించే ప్రత్యేక పోలీసు బలగం 'ఆక్టోపస్'. ఆక్టోపస్ పోలీసులు కేసీఆర్‌ను అరెస్టు చేసి వ్యాన్‌లో ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియకుండా సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌ను మించి వ్యూహాలు మారుస్తూ ఖమ్మం తరలించారు. ఖమ్మం మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి అక్కడి సబ్‌జైల్‌కు తరలించారు. తనను పోలీసులు ఎక్కడైతే ముట్టుకున్నారో అక్కడే దీక్షను ప్రారంభించారు. అక్కడి నుంచి ఖమ్మం దవాఖాన, తర్వాత నిమ్స్‌కు తరలించే వరకు 11 రోజులపాటు దీక్ష కొనసాగించారు. కేసీఆర్ దీక్షతో దిగొచ్చిన కేంద్రం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని డిసెంబర్ 9న రాత్రి ప్రకటించిన తరువాత కేసీఆర్ తన ఆమరణ నిరాహార దీక్షను విరమించారు.

ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, నవంబర్ 28: కాంగ్రెస్ పాలనలో ఎక్కడ చూసినా అక్రమ అరెస్టులు, లాఠీచార్జీలు, నిర్బంధాలు, కూల్చివేతలు, పేల్చివేతలు జరుగుతున్నాయని, ఇందిరమ్మ రాజ్యమంటే ఇట్లనే ఉంటదా? అని బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఇది ప్రజా పాలన కాదు, రాక్షస పాలన అని మండిపడ్డారు. గురువారం ఆయన నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ భూములు పాడిపంటలతో కళకళలాడితే, రేవంత్‌రెడ్డి వచ్చాక అగ్నిమంటలతో కాలిపోతూ కనిపిస్తున్నాయని దుయ్యబట్టారు. జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, బీఆర్‌ఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా, రాంకిషన్‌రావు, సుజీత్‌సింగ్, ప్రభాకర్, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

కరీంనగర్ శివారులోని అల్గునూరులో నిర్వహించే దీక్షా దివస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎమ్మెల్యేలు రసమయి, సుంకె రవిశంకర్ తదితరులు

కేసీఆర్ దీక్షతోనే కల సాకారం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 28 : నాడు కేసీఆర్ చేపట్టిన దీక్ష వల్లే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ పరిధిలోని అల్గునూర్‌లో శుక్రవారం చేపట్టనున్న దీక్షాదివస్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటుతర్వాత 24 గంటల కరెంటు, భూమికి బరువయ్యేంత ధాన్యం పడిందని అన్నారు. కేసీఆర్ అరెస్టైన స్థలాన్ని తాము పవిత్రంగా భావిస్తున్నామని తెలిపారు. అక్కడే దీక్షా దివస్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ముఖ్యఅతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నట్టు తెలిపారు. కెప్టెన్ లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ కేసీఆర్ ఆమరణ దీక్ష వల్లే తెలంగాణ సాధ్యమైందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు.